క్లుప్తంగా

పీహెచ్‌సీలో వైద్య శిబిరం



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరు పీహెచ్‌సీలో 'స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా ఉపవైద్యాధికారిణి గీత ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, సైకియాట్రిక్ వైద్య నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైద్యులు సంధ్యారాణి, సౌజన్య, సీహెచ్‌ఓ మున్వార్, హెచ్‌ఈఓ సత్యనారాయణ, సూపర్ వైజర్లు వెంకటేశ్వర్లు, యాదమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది మణెమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి పూజలు, ప్రత్యేక లంకరణ చేశారు. అమ్మవారు దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ అధికారులు, వైద్యులు

తుక్కుగూడ: జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి బోనగిరి శ్రీనివాస్, కమిషనర్ ఏ.వాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవినాయక్, వైద్యులు జయశ్రీ, ఉమరాణి, జయప్రకాశ్, శశికళ, శృతి, సూర్యనాయక్, పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన సర్దార్‌నగర్ మార్గం

రాకపోకలు నిలిపివేసిన అధికారులు



సర్దార్‌నగర్ రోడ్డుపై పారుతున్న వరద

తుక్కుగూడ: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. వాగులు, వంకలు పారుతున్నాయి. బాగ్ మంఖాల్ చెరువు నుంచి పులిందర్ వాగు,, తుక్కుగూడ సూరం చెరువు నుంచి వరద నీరు బొమ్మల కుంట మీదుగా భారీగా రావిర్యాల చెరువులోకి వచ్చి చేరుతుంది. మంగళవారం నాటికి రావిర్యాల చెరువు నిండి అలుగు పారుతోంది. రావిర్యాల నుంచి సర్దార్‌నగర్ మార్గం నీట మునిగిపోయింది. దీంతో మున్సిపల్ అధికారులు రాకపోకలు నిలిపేశారు. మంగళవారం సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సీసీరోడ్డు పరిశీలన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ శ్రీహిల్స్ కాలనీలో రూ.10 లక్షలతో వేసిన సీసీరోడ్డును మంగళవారం కమిషనర్ పి.సరస్వతి పరిశీలించారు. సీసీరోడ్డు నిర్మాణంతో కాలనీకి అందం వచ్చిందన్నారు. కాలనీలో మిగిలిపోయిన పనులు కూడా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీహిల్స్ కాలనీ ఫేస్‌-2 అధ్యక్షుడు జెల్ల రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దారిద్ర్యం

- పాత శ్రీశైలం మార్గంలో నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు ఛిద్రం
- ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కొత్తూరు గేట్-తుమ్మలూరు పాత శ్రీశైలం రహదారి దుస్థితి

కందుకూరు: చిత్రంలో కనిపిస్తున్న రోడ్డు గతంలో హైదరాబాద్-కల్వకుర్తి మీదుగా శ్రీశైలం వెళ్లే ప్రధాన రహదారిలో ఓ భాగం. ఆ తర్వాత కొన్నేళ్లకు గ్రామాల మీదుగా ఉన్న ఆ రహదారిని వదిలి నేరుగా రోడ్డు నిర్మించడంతో ప్రస్తుతం పాత రహదారి అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో ఆ రహదారి మీదాగా రాకపోకలు సాగించే రైతులు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులిచ్చినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంట తరలిచేందుకు ఇక్కట్లు

50 ఏళ్ల క్రితం హైదరాబాద్-శ్రీశైలం వెళ్లాలంటే పాత రహదారి మీదుగానే రాకపోకలు సాగేవి. మండల పరిధిలోని కొత్తూరు గేట్ నుంచి తుమ్మలూరు గ్రామం తూర్పు వైపు మీదుగా మొహబత్‌నగర్ నుంచి తుక్కుగూడ మీదుగా రాకపోకలు సాగేవి. కాలక్రమంలో నేరుగా రహదారిని నిర్మించడంతో పాత రహదారి విస్మరణకు గురైంది. ప్రస్తుతం కొత్తూర్ గేట్ నుంచి తుమ్మలూరు గ్రామం మధ్య నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న రహదారి అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గుంతలు, ఇరువైపులా కంప చెట్లతో నిండిపోయి ఉంది. దీంతో ఆ రహదారి వెంట రాకపోకలు సాగించలేని పరిస్థితి దాపురించింది. మరోపక్క ఆ రహదారి వెంటే ఓ వైపు తుమ్మలూరు, మరో వైపు కొత్తూరు గ్రామాల రైతుల పొలాలు ఉన్నాయి. దీంతో నిత్యం ఆ రహదారి నుంచే రాకపోకలు సాగించడం, పండించిన పంటను మార్కెట్లకు తరలించడం కష్టంగా మారింది. నాలుగు కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేస్తే తుమ్మలూరు మీదుగా మహేశ్వరం మండల కేంద్రానికి వెళ్లేందుకు కొత్తూరుతో పాటు కందుకూరు వైపు గ్రామాలకు చెందిన వారికి దూరభారం తగ్గుతుంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లు

మరోసారి ప్రతిపాదనలు

కొత్తూనే గేట్ నుంచి తుమ్మలూరు మార్గం వరకు ఉన్న రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాలేదు. మరోసారి ప్రతిపాదనలు పంపుతాం. – అనిల్‌కుమార్, డీఈఈ, పీఆర్

ఉచిత రక్త పరీక్షలు

దిల్‌సుఖ్‌నగర్: నగరంలోని మాగ్నిస్ డయాగ్నస్టిక్స్ సంస్థల ఎండీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఆర్‌కేపురంలోని చిత్రా లేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహంలో సోమవారం ఉచిత రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాథ విద్యార్థులకు ఉచిత బ్లడ్ టెస్టులు చేశామన్నారు.

నేడు తిరు కల్యాణం

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

పహాడీషరీఫ్: మామిడిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, హవనం కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, దేవతా ఆహ్వానం కార్యక్రమాలు కొనసాగాయి. కాగా బుధవారం ఉదయం 11 గంటలకు స్వామివారి తిరు కల్యాణం జరుగనుందని, ఈ వేడుకకు వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు హాజరవుతారని చైర్మన్ క్లాం నరేశ్‌గౌడ్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఈవో మురళీకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు చీమలదారి చెన్నయ్య, గొండ్యాల శేఖర్ ముదిరాజ్, ఎలిగపల్లి అనిత, కానుగుల భాస్కర్, గుర్జని రాధిక, అర్చకులు సుధీర్ కుమార్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హోమ పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల

అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: డివిజన్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ కర్ణన్‌ను కలిసి ఆమె డివిజన్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రజల సౌకర్యార్థం పలు అంశాలపై వినతులు సమర్పించినా అధికారులు స్పందించడం లేదని, పన్నులు చెల్లించే కాలనీల ప్రజలకు కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులకు ఉందన్నారు. బాపునగర్, భగత్ సింగ్‌నగర్, చెరుకుతోటకాలనీ, ఎస్‌బీఐ కాలనీ, చాడీలో రోడ్ల రీకార్పెటింగ్ చేయాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ కమిషనర్‌ను కోరారు. చౌడీ సర్కిల్ బ్యూటిఫికేషన్ చేయాలని, అదే విధంగా సీఎం రోడ్డు విస్తరణ చేపడితే మరింత అభివృద్ధి ఉంటుందన్నారు. ఓపెన్‌జిమ్ సామగ్రి మంజూరు చేయాలని, కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో విజయపురికాలనీ నాలా పనులు నిలిచిపోయాయని కమిషనర్‌కు వివరించారు. ముఖ్యంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, పెండింగ్‌లో ఉన్న మిగతా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె కమిషనర్‌ను కోరారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సరూర్‌నగర్ కార్పొరేటర్ శ్రీవాణి

సంఘం బలోపేతానికి చర్యలు



సమావేశంలో పాల్గొన్న పాలకమండలి సభ్యులు

బాలాపూర్ సహకార సంఘం చైర్మన్ పెంటారెడ్డి

బడంగ్‌పేట్: జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఎక్కడలేని విధంగా బాలాపూర్ సహకారం సంఘం అభివృద్ధికి బాటలు వేశామని చైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి అన్నారు. మంగళవారం బాలాపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ బండ్లగూడ ఖాల్సా 50వ వార్షిక స్వర్ణోత్సవ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటారెడ్డి మాట్లాడుతూ.. 1975లో సహకార సంఘం స్థాపించామన్నారు. కోట్ల రాబడితో విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు. పొదుపు సంఘాలకు రుణాలు ఇస్తున్న ఏకైక సహకారం సంఘమన్నారు. మల్టీపర్పస్ విధానాలు అమలు చేసి రైతులకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడంతో పాటు ప్రైవేట్ బ్యాంకులకు దీటుగా బంగారు ఆభరణాలపై రుణాలు, బ్యాంకు లాకర్ల సదుపాయాలు కల్పించామని చెప్పారు. ట్రిపుల్ ఎస్ ఖాతాలు, పిల్లల భవిష్యత్ కోసం బాల గణేశ్ ఖాతాలు ఓపెన్ చేశామన్నారు. కోట్లల్లో రికరింగ్, స్వచ్ఛంద డిపాజిట్లను సేకరించామన్నారు. గృహ నిర్మాణ రుణాలు అందిస్తున్నామని వివరించారు. బాలాపూర్ సహకార సంఘానికి సహకారం అందిస్తున్న గ్రామస్తులకు, ఖాతాదారులకు, రైతులకు ధన్యవాదాలు తెలిపారు. సంఘం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని మాజీ మేయర్ చిగురింత పారిజాత అన్నారు. అనంతరం పాలక మండలి సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, పాలకమండలి సభ్యులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అరుణారెడ్డి, నర్సమ్మ, లింగం, బాలయ్య, సంపత్‌రెడ్డి, మహేందర్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి, మనోహర్, సుదర్శన్‌రెడ్డి, రైతులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పండుగ తర్వాత పనులు ప్రారంభించండి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- ఎస్‌ఎన్‌డీపీ, మున్సిపల్, జలమండలి అధికారులతో సమీక్ష

మీర్‌పేట: వర్షాలు తగ్గుముఖం పట్టాక మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎస్‌ఎన్‌డీపీ, ట్రంక్‌లైన్ పనులను ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో ఎస్‌ఎన్‌డీపీ, మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. మొదటి విడతలో ఎన్ని ట్రంక్‌లైన్ పనులు పూర్తయ్యాయి, ఇంకా పూర్తికాని పనుల వివరాలు, రెండో విడతలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో ఎన్ని పనులు ప్రారంభమయ్యాయి, మొదలుపెట్టని పనులు, అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దసరా పండుగ తరువాత ఎస్‌ఎన్‌డీపీ, ట్రంక్‌లైన్ పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

పాత లైన్ల స్థానంలో కొత్త పైపులు వేయాలి

అనంతరం జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మీర్‌పేట కార్పొరేషన్ 35వ డివిజన్‌లో తాగునీటి పైపులైన్లలో మురుగునీరు కలిసి సరఫరా అవుతోందని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. పాత పైపులైన్లను గుర్తించి వాటి స్థానంలో కొత్త పైపులను తక్షణమే వేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీల్లో తాగునీరు కలుషితం అవ్వకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే జలమండలి అధికారులకు సూచించారు. సమీక్షలో మీర్‌పేట కమిషనర్ నాగమణి, డీఈ వేణుగోపాల్, ఎస్‌ఎన్‌డీపీ డీఈ అనురాధ, జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం సరిత, మేనేజర్ ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎస్‌ఎన్‌డీపీ, మున్సిపల్, జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

విగ్రహాల ఆవిష్కరణకు ఆహ్వానం

మహేశ్వరం: మండల కేంద్రంలో 26, 27న నిర్వహించే చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే పి.సబితారెడ్డికి రజక, పద్మశాలి సంఘం నాయకులు మంగళవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఆహ్వాన పత్రికలు ఇచ్చిన వారిలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ పి.అంబయ్య యాదవ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఆనందం, శివగంగ ఆలయ మాజీ చైర్మన్లు నవీన్, సుధీర్‌గౌడ్, మాజీ ఆలయ డైరెక్టర్ చంద్రయ్య ముదిరాజ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, శంకర్, ప్రభాకర్, కుమార్, సురేష్, జాన్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్, రాజేశ్, రమేశ్ పలువురు రజక, పద్మశాలి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌డీపీ పనులు పూర్తి చేయాలి

బడంగ్‌పేట్: ఎస్‌ఎన్‌డీపీ రెండో దశ పనులు ప్రారంభించి.. తర్వగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె మున్సిపల్ పరిధిలోని 5వ డివిజన్ వినాయక హిల్స్, నవారు యాదిరెడ్డి, సౌభాగ్యలక్ష్మీనగర్ కాలనీల్లో పర్యటించారు. 1వ డివిజన్‌లోని ముంపు బాధితులతో మాట్లాడారు. వరదలకు మునిగిన ఇళ్లను పరిశీలించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రెండో దశ పనులు త్వరితగతిన ప్రారంభించి సమయానికి పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఈఈ వెంకన్న, ఏఈ హరీశ్, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్లు రాంరెడ్డి, ఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కృష్ణ తదితరులు ఉన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం

బడంగ్‌పేట్: వర్షాలు తగ్గిన వెంటనే ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపుతామని కాంగ్రెస్ నాయకుడు మల్లారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కమిషనర్ సరస్వతితో లిసి సీఎంఆర్, సీవైఆర్ కాలనీ, న్యూ మధురాపురి, మధురాపురి కాలనీల్లో పర్యటించారు. డీఈఈ వెంకన్న, ఏఈ హరీశ్‌తో మాట్లడి వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, శివకుమార్, సంతోష్, అశోక్, ప్రశాంత్, ప్రసాద్, రాజేందర్‌రెడ్డి, గణేష్, మహిపాల్‌రెడ్డి, నయిబ్ తదితరులు ఉన్నారు.



సీవైఆర్ కాలనీలో పర్యటిస్తున్న నాయకులు

ఘనంగా శరన్నవరాత్రోత్సవాలు



కందుకూరు: అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు



తుక్కుగూడ: అమ్మవారి పూజలో యువజన సంఘం సభ్యులు, భక్తులు

రెండోరోజు గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రెండోరోజు శ్రీగాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చింది. అలయంలో భక్తులు అమ్మవారికి, పరమశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ కుమార్, డైరెక్టర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు.

సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో..

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ మహంకాళి అమ్మవారు, రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు రెండోరోజు మంగళవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు.



తుక్కుగూడ: గాయత్రీదేవిగా మంఖాల్ మహంకాళి అమ్మవారు



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు



మహేశ్వరం: గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో ముచ్చింతల్ జిమ్స్ ఆస్పత్రి వైద్యులు, మెడికల్ కాలేజ్ విద్యార్థుల ఆధ్వర్యంలో పోషణ్ మహ్, స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మహిళల ఆరోగ్యం, సమతుల ఆహారం, తల్లి ఆరోగ్యం, రక్తహీనత నివారణ, సమగ్ర శ్రేయస్సు, పోషకాహారంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, బాలింతలు రోజు పాలు, గుడ్లు, పండ్లు, పప్పు ధాన్యాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు. అనంతరం బాలింతలు, పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. జిమ్స్ వైద్య విద్యార్థులు నాటికలు, ఆటపాటల ద్వారా ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిమ్స్ విభాగం వైద్యురాలు ప్రొఫెసర్ డా.ఉమారాణి, ప్రొఫెసర్ డా.సురేఖరావు, మహేశ్వరం ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎ.శ్రీదేవి, వైద్యులు, అంగన్‌వాడి టీచర్లు, వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, బాలింతలు, అంగన్‌వాడీలు

గ్రామాల్లో వసతుల కల్పనే లక్ష్యం

శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ కుమార్

మహేశ్వరం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ అల్లె కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 1వ వార్డులో ప్రత్యేక నిధులు రూ.10 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతీ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, తాగునీటి సౌకర్యంతో పాటు వీధి దీపాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌ల సహకారంతో మండలానికి మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లె భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.



డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు